క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న ముత్యాలనాయుడు, తదితరులు

కె.కోటపాడు: స్థానిక షిర్డీసాయి మందిరం సమీపంలో దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనా కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. అర్చకుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కింతాడ గ్రామ ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, షిర్డీసాయి మందిర కమిటీ చైర్మన్ వేగి రామారావు, యలమంచిలి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల సమావేశం నేడు

నాతవరం: వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నామని పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలతో పాటు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మంజూరు చేసిన నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులు వేగవంతంగా చేయడంపై చర్చిస్తామన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

5న వనితా సమ్మేళనం

చోడవరం రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 5న చోడవరంలో భారీ స్థాయిలో వనితా సమ్మేళనం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సమ్మేళనంలో వాసవీ క్లబ్ సభ్యులే గాకుండా చోడవరం పరిసర మండలాలు, గ్రామాలకు చెందిన మహిళలు ఎవరైనా పోటీ పడవచ్చని క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి శేష అశోక్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి సీతారత్న పద్మిని స్పష్టం చేశారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వనితా సమ్మేళనం సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందన్నారు. ఫ్యాషన్ షో, ఫన్నీ స్కిట్స్, ఐదు హౌసీ గేమ్స్, క్విజ్ గేమ్స్‌తో సర్‌ప్రైజ్ గిఫ్టులతో సరదా సరదాగా సాగుతుందన్నారు. మహిళలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి, సమాజంలో సాటి వారితో సమ్మిళితం కావడానికి ఈ మెగా కిట్టీ పార్టీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఐజీసీ ఎన్ఎస్‌సీ-23 క్యాంప్‌లో భాగంగా గురువారం టెంట్ ఫిచింగ్ పోటీలు నిర్వహించారు. ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఏపీ, తెలంగాణకు చెందిన 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాంప్ కమాండెంట్ ఇంగ్లీసర్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ వి.ఎం.రెడ్డి క్యాడెట్లు వేసే టెంట్ల తీరుని పరిశీలించారు. ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన వారిని నౌసేనా, రిపబ్లిక్ డే పెరేడ్‌లకు ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు అరవింద్, తులసి, నాగేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



పూజలు చేస్తున్న దాత రామలక్ష్మణ దొర

రోలుగుంట: కంచుగుమల కూడలిలో గత నెల 29న ప్రారంభమైన రామలక్ష్మణ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. అయోధ్య నుంచి ఇక్కడకు తీసుకొచ్చిన రాముల వారి వెండి పాదుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు పండాలని ఇక్కడ శాంతి హోమం జరిపించారు. ముగింపు రోజు స్వామివారిని భక్తులతోపాటు విగ్రహ నిర్మాణదాత రామలక్ష్మణ దొర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి హరిభజనతో భక్తిపారాయణం చేశారు.

అనురాగ బంధం.. ఆనంద నందనం

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అద్దంపట్టే రాఖీ పండగను వాడవాడలా ఆనందంగా జరుపుకున్నారు. తమ సోదరులకు రాఖీలు కట్టి ఆప్యాయత చూపించారు. నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష అంటూ అనురాగ బంధాన్ని పంచుకున్నారు. తమ సోదరీమణులకు చిరుకానులిచ్చి ఆశీర్వదించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



దేవరాపల్లి: తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో సోదరులకు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



రోలుగుంట: అన్నకు రాఖీ కట్టి ఆనందం పంచుకుంటున్న చిన్నారి

చోడవరం: రాఖీపౌర్ణమి పండగను అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఎంతో సందడిగా గురువారం జరుపుకున్నారు. తమ సోదరులకు సోదరీలు రాఖీలు కట్టి చిన్నాపెద్దా అంతా ఎంతో ఆనందంగా గడిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. రాఖీ సంబరాలతో మిఠాయిల, రాఖీ అమ్మకాల దుకాణాలు కళకళలాడాయి.

దేవరాపల్లి: అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. సోదరీమణులంతా తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెనుగుపూడి డాక్టరు బీఆర్. అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు వారి అక్కాచెల్లెళ్లు మిఠాయిలు తినిపించి రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు.

పర్యావరణ రహిత రాఖీలతో..

మాకవరపాలెం: మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి ఆనందంగా గడిపారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఉపాధ్యాయులు పర్యావరణ రహిత రాఖీలను తయారు చేసి వారితో కట్టించారు. పేపర్లతో రాఖీలను తయారు చేయించి పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు రక్షాబంధన్ విశిష్టతను తెలియజేశారు.

రావికమతం: మండలంలో గ్రామ గ్రామాన రాఖీ పండగ గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారుల మొదలు పెద్దల వరకూ సోదరీమణులు సోదరులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సోదరీమణులకు కానుకలు అందించి ఆశీర్వదించారు. స్కూల్‌లో చిన్నారులు సైతం అన్నలకు రాఖీలు కట్టి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాఖీలు, మిఠాయి దుకాణాలు వద్ద రద్దీ కనిపించింది.

రోలుగుంట: మండలంలో రక్షాబంధన్ వేడుక ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా షడ్రుచులతో భోజనాలు చేసి రోజంతా వారితోనే ఆనందంగా గడిపారు. విద్యార్థులైతే ఈ పండగను మరీ ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా ఒక చిన్నారి తను దాచుకున్న డిబ్బీ డబ్బులతో కొనుగోలు చేసిన రాఖీని తన అన్న చేతికి కట్టి అనురాగాన్ని పంచుకుంది.



రావికమతం: చినపాచిలలో రాఖీలు కడుతున్న చిన్నారులు



మాకవరపాలెం: తూటిపాల పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

రోడ్డు విస్తరణపై టీడీపీ వైఖరేంటి?

- రోడ్డు విస్తరణపై కౌన్సిల్లో మాటల యుద్ధం
- వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి



వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ పద్మావతి వాగ్వాదం

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. ప్రధానంగా పట్టణ రోడ్డు విస్తరణపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధంతో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది ముందుగా ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు. పారిశుధ్య సమస్య గురించి పలువురు ప్రతిపక్ష సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, అక్టోబర్ నెలాఖరుకు ఈ సమస్య ఉండదని స్పష్టం చేశారు. కౌన్సిలర్ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. 26వ వార్డులో నాలుగు విద్యుత్తు స్తంభాలు వేయాలని, కొన్ని నెలలుగా కోరుతున్నా పట్టించుకోవటం లేదని, మెయిన్ రోడ్డు విస్తరణ వందడుగులు చేస్తున్నారా.. 90 అడుగులు చేస్తున్నారా? ప్రజలకు స్పష్టత ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ స్పందించి రోడ్డు విస్తరణపై ముందు టీడీపీ వైఖరేంటో స్పష్టం చేయాలని ఆమెను ఎదురు ప్రశ్నించారు. దాంతో రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. రోడ్డు విస్తరణపై ఎలాంటి అపోహలు లేవని, 105 మంది భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు నిరభ్యంతర పత్రాలను అందజేశారని వైస్ చైర్మన్ స్పష్టం చేశారు. ఎంతసేపూ ఎదుట వారిని తప్పుపట్టడమే మీ పనా? అని ఆగ్రహిస్తూ.. ఒక మంచి పని చేస్తున్నప్పుడు టీడీపీ వైఖరి ముందు ప్రజలకు తెలియజేయాలని ఎదురుదాడికి దిగారు. దాంతో ఆమె నుంచి సమాధానం లేకపోయింది. సమావేశంలో కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ: బాల్య వివాహాల నిర్మూలనపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి సావిటి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు మనం బాధ్యత తీసుకుని, వీటి వల్ల కలిగే నష్టాలపై బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ర్యాలీలో ఎంఈవోలు బత్తి వెంకటరమణ, కొర్ర బొంజిబాబు, స్థానిక గ్రామ సచివాలయం మహిళా పోలీసు రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు

ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న 50 మంది



ఆటల పోటీలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రావికమతం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, టి.అర్జాపురం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు ఆట విడుపుగా గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ పోటీల్లో ఉత్సాహంగా 50 మంది పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. కొత్తకోట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి జీపీఎస్ నాయుడు ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు గురు పూజోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని హెచ్ఎం తెలిపారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీటీ సురేష్, ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. గురువారం చిననందిపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పౌరహక్కులు విధిగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సోదరభావంతో మెలగాలన్నారు. డీటీ ఎస్. సురేష్, వీఆర్వో స్వాతి, సచివాలయ మహిళా పోలీస్ దేవి పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల పెంపకం లాభదాయకం

పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రామ్మోహన్‌రావు, ఏడీ బైరాగి




లేగదూడ యజమానికి బహుమతిని అందిస్తున్న రామ్మోహన్‌రావు, బైరాగి



పోటీలకు తీసుకువచ్చిన లేగదూడలను పర్యవేక్షిస్తున్న రామ్మోహన్‌రావు

కె.కోటపాడు: పాడి రైతులు మేలు జాతి పశువుల పెంపకాన్ని చేపట్టాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి బి.రామ్మోహన్‌రావు తెలిపారు. కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం వారాడ గ్రామంలో ఏడాది లోపు లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం గ్రామాల నుంచి వచ్చిన 44 పెయ్యిల్లో ఆరోగ్యకరమైన పశుపోషణ కలిగిన మూడింటిని ఎంపిక చేసి బహుమతులు అందించారు. వీటితోపాటు ప్రదర్శనకు తీసుకువచ్చిన పెయ్యిల పెంపకందారులకు కన్సోలేషన్ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పశుపోషణలో పశువైద్య సిబ్బంది ఇచ్చే సూచనలను పాటించాలని వివరించారు. కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ ఏడీ జి.బైరాగి మాట్లాడుతూ రైతులకు 60 శాతం రాయితీపై టీఎంఆర్ దాణాను అందిస్తున్నట్లు తెలిపారు. పాడి పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, ప్రియాంక, సర్పంచ్ గొంర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొంర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, పాల సంఘం అధ్యక్షుడు దొగ్గ శివప్రసాద్, పశువైద్య సహాయకులు గోపి, ఆర్.సాయికుమార్, గోపాలమిత్ర వేచలపు గోవింద పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీల ఏర్పాటుతో పర్యవేక్షణ



ఎంపీడీవో హనుమంతరావుతో చర్చిస్తున్న సివిల్ సప్లయ్ డీటీ చంద్రరేఖ

నాతవరం: నిత్యావసర సరకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని సివిల్ సప్లయ్ డీటీ చంద్రరేఖ తెలిపారు. మండలంలో నిత్యావసర సరకులు పంపిణీ చేసే వాహనదారులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. జిల్లా స్థాయి కమిటీలో జాయింట్ కలెక్టరు జాహ్నవి చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. డివిజన్, మండల, పంచాయతీ స్థాయుల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యావసర సరకుల సరఫరాలో లోపాలను సరిచేస్తుందన్నారు. అనంతరం కమిటీ ఏర్పాటుపై ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడులతో చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలపై అవగాహన

మాకవరపాలెం: వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రకృతి సేద్య సిబ్బంది నారాయణరాజుపేటలో రైతులకు అవగాహన కల్పించారు. గురువారం ఇక్కడ వరి పొలాలను పరిశీలించారు. ద్రవ జీవామృతం తయారు చేయడం, పొలాల్లో పిచికారీ చేసే విధానాలను వివరించారు. ద్రవ జీవామృతం వాటడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటలు ఆరోగ్యకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రకతి సేద్య సిబ్బంది సుదర్శన్, రమణమ్మ, మంగ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ



వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న రావికమతం విద్యార్థులు

రావికమతం: జిల్లా సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ, విశాఖ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చోడవరంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో రావికమతం భవిత కేంద్రం దివ్యాంగ విద్యార్థులు సత్తా చాటారు. జావెలిన్ త్రో సీనియర్, జూనియర్ విభాగాల్లో కోసూరు లోకేష్, కురస సిద్ధార్థ ప్రథమ స్థానం, స్లో వాక్, 50 మీటర్ల పరుగు పందెంలో బత్తిన లిఖిత, మైచర్ల నిఖిల్ ద్వితీయ స్థానాలు సాధించారు. వంద మీటర్ల పరుగులో వియ్యు హరీష్ ద్వితీయ స్థానం సాధించాడు. వీరిని జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, రోటరీ క్లబ్ నిర్వాహకులు కె.వి.వి.ఎస్ మూర్తి బహుమతులు అందించారు. విజేతలను మండల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు గురువారం అభినందించారు.

లంపీస్కిన్ నిరోధక టీకాలు వేయించాలి

వీబీఆర్ఐ సంయుక్త సంచాలకుడు చంద్రమౌళి నాయక్



పశువులకు వేస్తున్న లంపీస్కిన్ నిరోధక టీకాలు పరిశీలిస్తున్న ఏడీ చంద్రమౌళీనాయక్



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చంద్రమౌళీనాయక్

మాడుగుల: ప్రస్తుతం పశువుల్లో సంక్రమించే అతి ప్రమాదకరమైన లంపీస్కిన్‌ను నిరోధించడానికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలు తప్పనిసరిగా వేయించాలని బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహాయ సంచాలకుడు చంద్రమౌళీనాయక్ తెలిపారు. గురువారం ఎం. కోడూరులో ఉచితంగా వేస్తున్న లంపీస్కిన్ నిరోధక టీకాలను ఆయన పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి పశువ్యాధుల నిర్ధారణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంత వరకు ఎన్ని శాంపిల్స్ తనిఖీ చేశారో ల్యాబ్ టెక్నీషియన్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ వి. చిట్టినాయుడు, ఉమ్మడి విశాఖ పశువ్యాధుల నిర్ధారణ కేంద్రం పశువైద్యాధికారి హిమజ, స్థానిక పశువైద్యాధికారులు మణిలక్ష్మణ్, పశుసంవర్ధక సహాయకుడు చంద్రరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్రత్యేకాధికారి ప్రభాకరరావు



జేడీపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మాడుగుల: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా గురువారం జేడీపేటలో జగనన్న లేఅవుట్లను పరిశీలించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు ప్రభుత్వ రాయితీలు వివరించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఎంపీడీవో మీనాకుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెచ్చా రమేష్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సూక్ష్మ రుణాలతో ఆర్థికాభివృద్ధి

లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

కె.కోటపాడు: అర్హులైన వారికి సూక్ష్మరుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల బ్యాంకర్లతో జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి, రైతులకు వ్యవసాయ యాంత్రీకరణకు అందిస్తున్న సహకారానికి బ్యాంకర్లు అదనపు రుణాలను మంజూరు చేయడం ద్వారా వారు మరింతగా ఆయా రంగాల్లో రాణిస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ ధర్మారావు, ఎంపీడీవో కె.శచీదేవి, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు కె.శ్రావణ్‌బాబు, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

పాడి పశువుల కొనుగోలుకు రుణాలు



మాట్లాడుతున్న పశువైద్యాధికారి అచ్యుత్‌రామ్

చోడవరం రూరల్: మహిళా పాడి రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని గవరవరం పశువైద్యాధికారి, రూట్ మెంటార్ ఎ.అచ్యుతరామ్ తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం గవరవరం, లక్ష్మీపురం గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా పాడిపశువుల కొనుగోలు, పోషణకు రుణమేళాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాడిరైతు సదస్సుల్లో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో అమూల్ పాల కేంద్రాలకు పాలు సరఫరా చేసే రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షలు, పశు పోషణ ఖర్చుల నిమిత్తం మరో రూ.30 వేలు రుణంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా సమకూరుస్తున్నట్టు వెల్లడించారు. అమూల్ పాల కేంద్రాలకు పాలను సరఫరా చేయడం ద్వారా పాడి రైతులు తగు లబ్ధిని పొందవచ్చని, తద్వారా వచ్చిన సొమ్ముతో తాము పొందిన రుణాలను సకాలంలో తీర్చాలని సూచించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చోడవరం బ్రాంచి మేనేజర్ జి.రవితేజ మాట్లాడుతూ తాము ఇచ్చిన రుణాల ద్వారా పాడిపశువులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం పొందాలన్నారు. రుణాన్ని సకాలంలో తీర్చినట్టయితే వారికి మరింత రుణం ఇవ్వడానికి సహకార బ్యాంకు సుముఖంగా ఉంటుందని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పి.నర్సింగరావు (గవరవరం), ఎస్.భవాని గణపతినాయుడు (లక్ష్మీపురం), రూట్ ఇన్‌చార్జి రమారత్నం, అమూల్ సొసైటీ మెంబర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

ఎంపీపీ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ సామాజిక తనిఖీలతో పనుల్లో అవకతవకలు వెలుగులోకి వస్తాయన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి మాట్లాడుతూ మండలంలోని 12 పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 617 పనుల నిమిత్తం రూ.9.16 కోట్లు ఖర్చు చేశారన్నారు. వీటికి సంబంధించి ఈ నెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జయమాధవి, ఏపీవో నానిబాబు, ఎస్ఆర్పీ బి.సూర్యనారాయణ, డీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై చాఫ్‌కట్టర్ యంత్రం



చాఫ్‌కట్టర్‌ను యంత్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

చీడికాడ: ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్టు సర్పంచ్ కోడూరి సత్యవతి తెలిపారు. గురువారం జైతవరం రైతు భరోసా కేంద్రం నుంచి గ్రామానికి చెందిన పాడి రైతుకు రూ.33,790 విలువ చేసే చాఫ్‌కట్టర్‌ను 40 శాతం రాయితీపై రూ.20,388 అందించారు. ఈ యంత్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కురచా కుమారి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, పాల సంఘం అధ్యక్షుడు రెడ్డి బలరాం, నాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.